క్లుప్తంగా

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లోని పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల ఎత్తు, బరువు, తల చుట్టుకొలత, బీపీ, రక్తన మూనా వంటి పరీక్షలు, ఆరోగ్య సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఫిరంగిపురంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకట రమణ పాల్గొని పదోతరగతి విద్యార్థులు 87మందికి పరీక్షలు చేసి యాప్‌లో నమోదు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం మాబు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కోటిలింగాల క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కోటి లింగాల క్షేత్రంలో మహా కాళేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనుండటంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఆలయం వద్ద కొన్ని ప్రాంతాల్లో భక్తులకు టెంట్లు ఏర్పాటు చేసి మంచినీటి సదుపాయం కల్పించామన్నారు. ఆలయం ఎదురుగా ఆలయంలోకి వచ్చే భక్తులకు నెట్టుకోకుండా ఉండేందుకు బారికేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాక భక్తులు వచ్చేదారిలో శ్రీరాముడి విగ్రహాన్ని ఉంచామని భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు చేసేలా ఏర్పాటుచేశామన్నారు. భోజన వడ్డించేందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాబా ఆదేశాల మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలుగా సౌకర్యంగా ఉండేలా చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పశువులకు చూడి పరీక్షలు



ఫిరంగిపురం: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు నుదురుపాడు పశువైద్యశాల పరిధిలోని యర్రగుంట్లపాడు గ్రామంలో మంగళవారం పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ టి.కేశవరావు శిబిరాన్ని ప్రారంభించారు. పశువైద్యాధికారి పీర్‌అహ్మద్ 25 పశువులకు చూడి పరీక్షలు చేసినట్లు తెలిపారు. 32 గేదెలకు సాధారణ వ్యాధి పరీక్షలు, 23 దూడలకు డీవార్మింగ్ వేసినట్లు ఆయన వివరించారు. శిబిరానికి వచ్చిన రైతులకు పశువుల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఒక జీవానికి శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పూర్తిస్థాయిలో పశువుల పెంపకం గురించి, వాటికి పెట్టవలసిన ఆహారం గురించి, సీజనల్‌గా వచ్చే వ్యాధులు గురించి వివరించారు. పశువైద్యసిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

కర్మల భవన ప్రాంగణాన్ని శుభ్రం చేసిన విద్యార్థులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కొత్తూరు వంతెన వద్ద ఉన్న కర్మల భవన ప్రాంగణాన్ని మంగళవారం విజయవాడకు చెందిన పొట్టి శ్రీరాములు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాలను, పరిసరాలను స్వచ్ఛందంగా శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, భీమిరెడ్డి రామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, మోహన్‌బాబు, జగన్మోహనరావు, శ్రీనివాస్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలి



తాడేపల్లిరూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సీపీఎం తాడేపల్లి పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశం కొట్టే కరుణాకరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాశం రామారావు మాట్లాడుతూ అర్హులైన పట్టణ పరిధిలో పేదలందరికి రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. గృహ నిర్మాణ పథకాన్ని వెంటనే అమలు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పట్టణంలోని బైపాస్, ఇతర ప్రాంతాల్లోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు కృష్ణానది నీటిని ప్రజలకు అందజేయాలని అన్నారు. సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, అడ్డగట్ల శౌరి బర్తిలోమ్, దొంతిరెడ్డి విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొని తెచ్చుకుంటున్నారు!

- నగరంలో విచ్చలవిడిగా హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బిర్యానీ సెంటర్లు
- చాలా చోట్ల నిల్వ ఉన్న మాంసం, కూరగాయలతోనే వంటలు
- యథేచ్ఛగా హానికర రంగుల వినియోగం
- నూనెను మళ్లీ మళ్లీ వినియోగిస్తున్న వైనం
- అనారోగ్యం బారిన నగర ప్రజలు
- తూతూమంత్రంగా ఆహార సలహా సంఘాలు



రంగు కలిపి వేయించిన చికెన్, అపరిశుభ్రంగా ఉన్న ఉల్లిపాయలు, పచ్చిమిర్చి



మళ్లీ మళ్లీ వాడుతున్న నూనె

తాడేపల్లిరూరల్: అధికారుల నిర్లక్ష్యం, ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కల్తీ ఆహారాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, హోటళ్లు ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకపోతే సెక్షన్ 63 ప్రకారం ఫుడ్ సేఫ్టీ కమిషన్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే 6 నెలలు జైలుశిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తారు. ఆహార పదార్థాల తయారీకి టేస్టింగ్ సాల్ట్ (చైనా సాల్ట్)ను వినియోగించకూడదు. రోజువారీగా వినియోగించే ఉప్పును మాత్రమే ఉపయోగించాలి. ఈ నిబంధనలను హోటళ్ల, రెస్టారెంట్ల యాజమాన్యాలు పాటించడం లేదు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. వంట వండే వ్యక్తి వడ్డించే వ్యక్తులకు సంబంధిత హోటల్ యజమాని డాక్టర్ సర్టిఫికేట్ తప్పనిసరిగా తీసుకోవాలి.

పుట్టగొడుగుల్లా బిర్యానీ పాయింట్లు..

పెద్ద హోటళ్లు, కొన్ని రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. మాంసం సైతం ఇదేవిధంగా ఫ్రిజ్‌లో ఉంచి వండుతున్నారు. నాన్‌వెజ్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. రకరకాల పేరిట బిర్యానీ, చికెన్, మటన్ హోటళ్లు జోరుగా వెలుస్తున్నాయి. ఇక వీటి సంగతైతే చెప్పాల్సిన పనిలేదు. కల్తీ నూనె, కల్తీ మాంసం, కల్తీ ఆహార పదార్థాలతో మటన్, చికెన్ బిర్యానీ తయారు చేసి విక్రయిస్తున్నారు. చిన్నా, పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు, చాట్, నూడుల్స్ షాపులు అన్నీ కలుపుకొని మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా 100కు పైగా ఉన్నాయి. వీటిలో ప్రతి సంవత్సరం రూ.కోట్ల వ్యాపారం జరుగుతోంది. అధికశాతం మురుగు నీటి కాలువలు, చెత్త కుప్పల పక్కనే వీటిని నిర్వహిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు.

ఆరోగ్యానికి అంత్యంత ప్రమాదకరం..

నియోజకవర్గంలో హోటల్ కల్చర్ పెరుగుతోంది. ఉద్యోగులు మొదలుకొని రోజువారీ కూలీల వరకు వివిధ పనులపై బయటకు వెళ్లినప్పుడు అవసరాన్ని బట్టి టిఫిన్, భోజనాలకు రెస్టారెంట్లను ఆశ్రయిస్తున్నారు. చాలా చోట్ల హోటళ్ల వారు కల్తీకి మొగ్గు చూపుతున్నారు. అనేకచోట్ల చనిపోయిన కోళ్లు, మేకలతో పాటు కుళ్లిపోయిన కూరగాయలు, పాచిపోయిన ఆకు కూరలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వంటకాలలో వాడుతున్నట్లు తెలియవస్తుంది. చాలాచోట్ల కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రంగులు కలుపుతూ క్యాన్సర్, గుండె జబ్బుల వంటి రోగాలకు కారణమవుతున్నారు. మరికొంతమంది హోటల్ నిర్వాహకులు తక్కువ ధరకు వస్తుందని కల్తీ నూనెలతో వంటలు చేసి ప్రజలకు అంటగడుతున్నారు.

అలంకార ప్రాయంగా ఆహార సలహా సంఘం

నియోజకవర్గంలో ఆహార సలహా సంఘాన్ని గతంలో ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఆహార సలహా సంఘం ఎక్కడా కూడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఆ సంఘానికి ప్రభుత్వం నుంచి సీఎస్‌డీటీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారితో పాటు సమాజంపై కొంత అవగాహన ఉన్న సామాజిక కార్యకర్తలను నియమించారు. వారు సైతం రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు భయపడి కల్తీ ఆహారం తయారు చేస్తున్న వారిని ప్రశ్నించడం లేదు. ఈ మధ్యకాలంలో ఓ రాష్ట్ర నాయకుడు హోటల్‌లో బిర్యానీ పార్శిల్ చేయించుకోగా అందులో బొద్దింక వచ్చింది. ఆ నాయకుడు ఆహార సలహా సంఘం వారికి ఫోన్ చేసినా వారి నుంచి ఎటువంటి స్పందన రాలేని ఆవేదన వ్యక్తం చేశారు.

కల్తీ ఆహారంతో వ్యాధులు



పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలో వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీంతో క్యాన్సర్, అల్సర్లు వచ్చే అవకాశం ఉంది. షుగర్‌లెస్ స్వీట్లలో అధికంగా సాక్రిస్ వినియోగిస్తారు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అన్ని రకాల పండ్లను ఆకర్షణీయంగా కనిపించేందుకు కార్బైడ్తో హానికారక రంగులు, జిగురు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీంతో కాలేయ సమస్యలు, కడుపు నొప్పి, నిద్రలేమి, కిడ్నీ సమస్యలు వస్తాయి.

– డాక్టర్ మానస, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు

అధికారులు తనిఖీలు నిర్వహించాలి



నాసిరకం వస్తువులతో చిరుతిళ్లు తయారు చేస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. రుచికరంగా రంగురంగుల్లో ఉండడంతో ప్రజలు వాటికి ఆకర్షితులై కొని, తిని వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు తనిఖీలు నిర్వహించి, కల్తీ ఆహారాన్ని అరికట్టాలి. ప్రతి గ్రామంలోను పట్టణాల్లోను ఆహార సలహా కమిటీలను ఏర్పాటు చేసి అందులో అధికారులకు కూడా బాధ్యత ఉండేటట్లు ప్రభుత్వం చర్యలు చేపడితే కల్తీ ఆహార పదార్థాలకు చెక్ పెట్టవచ్చు.

–బూరగ శ్రీనివాసరావు, ప్రొఫెసర్

షూటింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు షూటింగ్‌లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కేఎల్‌యూ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐయూ షూటింగ్ చాంపియన్ షిప్‌లో (క్రీడలు) ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ షూటింగ్ చాంపియన్‌షిప్ ఈ నెల 8 నుంచి చండీఘర్‌లోని మొహాలీ షూటింగ్ రేంజ్‌లో పంజాబ్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిశ్రమ విభాగంలో ముఖేష్, సాగనాయి తరుణ్, పి.తనిష్క్, మురళీధర్ నాయుడులతో కూడిన కేఎల్‌యూ జట్టు 5వ స్థానంలో నిలిచి మరో కాంస్య పతకం కూడా గెలుచుకున్నారని వివరించారు. ముఖేష్ కేఎల్‌యూలో బీటెక్ సీఎస్ఐటీ 3 వ సంవత్సరం చదువుతుండగా, నాగసాయి తరుణ్, పి. తనిష్క్, మురళీధర్ నాయుడులు బీబీఏ చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, వ్యాయామ అధ్యాపకులు విజేతలను అభినందించారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: తాడేపట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సీఐటీయూ తాడేపల్లి పట్టణ నాయకుడు బూరగ వెంకటేశ్వరరావుతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం న్యాయ పోరాటం చేస్తున్న కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతున్నా కార్మికులకు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఈ దీక్షలలో ఎం.శివకుమారి, టి.దుర్గాభవాని, శారమ్మ, రమాదేవి కూర్చొన్నారు.ఈ కార్యక్రమంలో ఏసీసీ కార్మిక పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ, బి.సూరి, వై.సాంబయ్య, ఎండీ రహంతుల్లా, శారద, లక్ష్మి, బుజ్జి, నాగేశ్వరరావు, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

తడి,పొడి చెత్తపై అవగాహన అవసరం

తాడేపల్లిరూరల్: పొడిచెత్త, తడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఇంటి నుంచి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట, డోలాస్‌నగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. పలుచోట్ల రోడ్లపై చెత్తవేయడాన్ని గమనించి ఆయన శానిటేషన్ అధికారులు, ఇతర శాఖల అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నివాసాల నుంచి వచ్చే చెత్తను ప్రజలు బయట పడవేయకుండా కార్యాలయంలోని సిబ్బంది తమ తమ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, చెత్తను బయట వేయడం వల్ల వచ్చే అనర్థాలను వారికి వివరించాలని, ప్రతి ఇంట్లోను కార్పొరేషన్ తడి చెత్త, పొడిచెత్త సేకరించేందుకు డస్ట్‌బిన్స్ అందజేసిందని, వాటిల్లో చెత్తను వేసి శానిటేషన్ సిబ్బందికి ఇచ్చేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేషన్ డీఈలు, ఏఈలు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు

మేడికొండూరు: కాలయాపన చేయకుండా కౌలు రైతులకు బ్యాంకు రుణాలు వెంటనే ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకుడు బొట్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని మందపాడు గ్రామంలో మంగళవారం కౌలు రైతులకు పంట రుణాలపై బ్యాంకర్లతో సమావేశం జరిగింది. కౌలు రైతులు ఈ– క్రాప్ నమోదు చేసుకొంటే విపత్తులు సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ కౌలు రైతులకు అందించడం జరుగుతుంతోందని ఏఓ ఎం.నాగరాజు తెలిపారు. మేడికొండూరు మండలం మందపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంట సాగుదారు హక్కు పత్రం సీసీఆర్సీ కౌలు దారులకు వ్యవసాయ పంట రుణాల మంజూరుపై గ్రామ స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారి ఎం.నాగరాజు మాట్లాడుతూ పంటకు బీమా చేయడం ద్వారా పంటకు రక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తీసుకునే సర్వే నెంబర్‌లు గల భూములలో కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని, ఇచ్చిన తరువాత లోన్ కార్డ్‌లలో నమోదు చేయబడతాయన్నారు. రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మందపాడు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషిచేద్దాం

- వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయ కర్త వనమా బాల వజ్రబాబు
- తాళ్లాయపాలెం, దొండపాడు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం

తాళ్లాయపాలెం(తాడికొండ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయ కర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) సూచించారు. మంగళవారం తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం, దొండపాడు గ్రామాల్లో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పటిష్టమైన స్థానం ఉందని, కూటమి ప్రభుత్వం మాయమాటలకు లొంగిన ప్రజలు సంక్షేమం అందక, పేదలను పట్టించుకునే నాథుడు లేక ఇప్పుడు ఎందుకు ఓట్లేసి గెలిపించామా అని బాధలో ఉన్నారనేది బహిరంగ సత్యమన్నారు. తాను ప్రతి కార్యకర్తకు నిత్యం అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 2029లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు, నాయకుల ఐక్యత ముఖ్యమని, విభేదాలు విడనాడి అందరూ ఒకేతాటిపై పనిచేయాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కప్పదాటు చర్యలకు పాల్పడుతున్న కూటమి మోసాలను ఎండగట్టి ప్రజలకు జవాబుదారీ పాలన అందేలా నిలదీసేందుకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి త్వరలో ప్రజల్లోకి రానున్నారన్నారు. గత 5 సంవత్సరాల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి పేదవాడి ఇంట సంక్షేమం వెల్లి విరిసిందని ఇప్పుడు పేదలు నిరుపేదలుగా మారిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. త్వరలో ప్రభుత్వ కప్పదాటు వైఖరి, ప్రజలను మోసం చేసిన విధానంపై పార్టీ ఆదేశానుసారం దశలవారీ పోరాటంతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, నాయుడు నాగేశ్వరరావు, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు తాళ్ళాయపాలెం నాయకులు మిక్కిల సాల్మన్ రాజు, మేడిద శ్రీహరి, గద్దం జయరావు, కోలేటి అనీల్, దొండపాడు గ్రామ నాయకులు మైనేని నాగమల్లేశ్వరరావు, కాకుమాను బ్రహ్మయ్య, కొప్పుల ఆంథ్రీయప్ప మాస్టారు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




తాళ్ళాయపాలెంలో మాట్లాడుతున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

ముగిసిన పునీత ఆగ్నేసమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజాబలి నిర్వహిస్తున్న గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య



విద్యుత్ వెలుగుల్లో ఆగ్నేసమ్మ దేవాలయం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల గ్రామంలోని పునీత నిత్య సహాయ మాత ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామంలో కులమతాలకతీతంగా పండుగను జరుపుకొన్నారు. పండుగ ప్రత్యేక దివ్య పూజా బలిని ఆలయంలో గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వ మానవాళి పాపపరిహారార్థమై ఏసుక్రీస్తు ప్రభువు ఈ లోకానికి మానవ అవతారిగా మరియమ్మ గర్భాన జన్మించారని తెలిపారు. ఏసు రక్తం ద్వారా మానవాళి పాపాలకు శుద్ధీకరణ కలుగుతుందన్నారు. దైవభక్తి గీతాలు ఆలపించారు. భక్తులు కొవ్వొత్తుల సమర్పణ, రాత్రికి గ్రామ పురవీధుల్లో మేళతాళాల నడుమ, బాణసంచా కాల్చుతూ ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కుబడులను చెల్లించుకున్నారు. పేరేచర్ల విచారణ గురువులు నుదురుపాటి చంద్రమోహన్, విచారణ గురువులు, పలువురు ఫాదర్లు, మత కన్యలు, పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న కార్మిక, కర్షక ట్రాక్టర్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని నష్టపరిచే విధంగా అనేక చట్టాలు తీసుకురావడమే కాకుండా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియను అమలు చేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా జనవరి 26న 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో కార్మిక కర్షక సమస్యలను పరిష్కరించాలని ట్రాక్టర్, బైక్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ నాయకులు బూరగ వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ తాడేపల్లి ఏరియా నాయకులు కంచర్ల కాశయ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

యువకుడిపై కత్తితో దాడి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

తాడేపల్లిరూరల్: మహానాడులో ఒక యువకుడిపై దాడిచేయడానికి వచ్చి అతను అనుకుని మరో యువకుడిపై కత్తితో దాడిచేయడంతో గత మూడు రోజుల నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.. బాధితుడి అన్నయ్య లబ్బా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం .. ఈనెల 19న ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడుకుందామని తాను తన తమ్ముడు దీపక్ మరో నలుగురితో కలిసి మహానాడు 16వ లైన్ నుంచి పుష్కరఘాట్ల వద్దకు వెళుతుండగా మార్గమధ్యంలో సాతిమాటి మహేష్ అనేవ్యక్తి వచ్చి పరుష పదజాలంతో దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. మరో ఐదుగురు వచ్చి అడ్డుగా నిలుచున్నారు. ఈ సమయంలో సాతిమాటి మహేష్ తన చేతిలో వున్న కత్తి తీసి దీపక్‌ను పొడిచాడు. కృష్ణతేజ, శ్రావణ్, అభిలు మహేష్‌తో పాటు ఉన్నారు. తీవ్ర గాయాలపాలైన దీపక్‌ను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. జరిగిందేమని ఆరా తీస్తే.. గత ఏడాది డిసెంబరు 25వ తేదీన మనోజ్ అనే డిగ్రీ విద్యార్థిని నిందితుడు సాతిమాటి మహేష్ అతని స్నేహితులు పుష్కరఘాట్ల వద్ద బెదిరించారన్నారు. దీంతో మనోజ్ బంధువులు పలుమార్లు మహేష్‌కు ఫోన్ చేసి వార్నింగ్ ఇచ్చారన్నారు. దీంతో 19వ తేదీ ఒక జట్టుగా క్రికెట్ ఆడేందుకు వెళ్తున్న తామే మహేష్ బంధువులమని తలచి తమపై దాడికి పాల్పడ్డారని లబ్బా రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. మేము ఎవరిమో తెలుసుకోకుండానే పరుషపదజాలంతో గొడవపడి తనపై దాడి చేసి, తన తమ్ముడిని కత్తితో పొడిచినట్లు తెలిపాడు. జరిగిన ఘటనపై అదేరోజు రాత్రి 9 గంటలకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎవరో తమకు తెలియని వ్యక్తులు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి మీరు చదువుకుంటున్నారు, మీకు ఎందుకు కేసులు, వాళ్లు ఆవారా బ్యాచ్, వాళ్లు మీ మీద కేసులు పెడతారు, మీకు ఉద్యోగాలు రావని బెదిరిస్తున్నట్లు దీపక్ బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దీపక్ వీపు భాగంలో కత్తి దాడి జరిగిన దృశ్యం

బుల్లెట్ చోరీపై కేసు నమోదు

తాడికొండ: తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో బుల్లెట్ చోరీ చేసిన ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు. వివరాల ప్రకారం పొన్నెకల్లు గ్రామానికి చెందిన నెల్లూరి రాంబాబుకు చెందిన బుల్లెట్ 19వ తేదీ రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేయగా తెల్లవారు జామున లేచి చూసేసరికి కనిపించలేదు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళతో అసభ్య ప్రవర్తనపై కేసు

తాడికొండ: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. వివరాల ప్రకారం బట్టు శ్రీనివాసరావు వద్ద తాను స్థలం తాకట్టు పెట్టుకొని నగదు తీసుకొని తిరిగి చెల్లించగా.. నోట్లు ఇవ్వకుండా తనతో అసభ్యంగా మాట్లాడేవాడని బడేపురం గ్రామానికి చెందిన వద్ది లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంతటితో ఆగకుండా నగదు తిరిగి చెల్లించినప్పటికీ కనిపించలేదని చెప్పిన నోట్లను కోర్టులో వేశాడని, ఇదేంటని ప్రశ్నిస్తే తనను తాకి అసభ్యంగా ప్రవర్తించాడని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

మంత్రి లోకేష్ జన్మదిన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఈ నెల 23న మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్న లైవ్ మ్యూజిక్ షో ప్రాంగణాన్ని మంగళవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళగిరి పట్టణ పరిధిలోని ఎన్ఆర్ఐ వై.జంక్షన్ సమీపంలో నిర్వహించనున్నారు. ప్రాంగణానికి వచ్చే ప్రేక్షకుల భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ స్థానిక అధికారులతో సమీక్షించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో అడిషనల్ ఎస్పీ రవికుమార్, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, పట్టణ, రూరల్ సీఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరం జెడ్పీ ఉపాధ్యాయునికి డాక్టరేట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలుగు విభాగం ఆచార్య మాధవి పర్యవేక్షణలో 'చిలకమర్తిపై కందుకూరి ప్రభావం' అనే అంశంపై శ్రీనివాసరావు పరిశోధనా గ్రంథాన్ని సమర్పించగా పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు నాగార్జున యూనివర్సిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు విభాగం అధ్యాపకులైన ఆచార్య వరప్రసాద మూర్తి, ఆచార్య మాధవి, ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు ఆయనకు అభినందనలు తెలిపారు. శ్రీనివాసరావు డాక్టరేట్ పొందడం ఎంతో హర్షించదగ్గ విషయమని పాఠశాల హెచ్ఎం జి.సుబ్బారావు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కె.జోజప్ప, బుజ్జిబాబు, రమణమ్మ, వెంకటేశ్వరరావు, రామచంద్రారావు, ఆనందరావులు శ్రీనివాసరావును అభినందించారు.

